# వెయిటింగ్ ఫర్ ది ట్రైన్..

ఓ ప్రైవేట్ కన్‌స్ట్రక్షన్ కంపెనీలో ఫోన్ గణగణ మ్రోగింది. అక్కడే వున్న ఒకతను వెంటనే ఫోన్ ఎత్తాడు.

"అది సో అండ్ సో కంపెనీ ఏనా?" సూటిగా ప్రశ్నించిందా ఆడకంఠం.

"ఎస్ మేడమ్." వినయంగా సమాధానం.

"అక్కడ ఇంజనీర్ భానుమూర్తి గారున్నారా?"

"వున్నారు మేడమ్! ఒక్క క్షణం!" రిసీవర్ క్రిందపెట్టి భానుమూర్తిని పిలిచారు. భానుమూర్తి లైన్‌లోకి వచ్చాడు

"హల్లో!"

"భానుమూర్తి గారేనా?"

"ఎస్ మేడమ్ భానుమూర్తినే!"

"నేను సో అండ్ సోని. మీ కంపెనీ వాళ్ళే పోయిన్నెల్లో మా ఇల్లు కట్టారు!"

అలాగా? మేము ప్రతి నెల్లో నూ బోలెడు ఇళ్ళు కడతాం మేడమ్.

"చాలా సంతోషం. మాఇల్లు మీపర్యవేక్షణలో కట్టబడింది."

"అలాగా? చాలా సంతోషం మేడమ్ మీకు నచ్చిందా?"

"నచ్చడానికేం! బ్రహ్మాండంగా వుంది. ఐతే నాదో చిన్న సందేహం!"

"ఏమిటది మేడమ్?"

"మీరు బస్తా ఇసుకలో ఎన్ని టిస్పూన్లు సిమెంటు కలుపుతారో? అడిగి తెలుసుకుందాం అని ఫోన్ చేశాను." తడబడి పోయాడు భానుమూర్తి

"లేదు మేడమ్. మేము చాలా పెర్‌ఫెక్ట్‌గా పని చేస్తాం. మేము కట్టిన ఇళ్ళు వందేళ్ళైనా చెక్కుచెదరవ్" అన్నాడు ఖచ్చితంగా

"నా మొహంలా వుంది మీ ప్రజ్ఞ. నెల్లాళ్ళు కాలేదు ఇల్లు దడదడ లాడి పోతోంది ఎక్కడి నాబుర్ర మీద పడిపోతుందా అని భయపడి చస్తున్నాను."

"దడదడ లాడిపోతుందా, ఐ కాంట్ బిలీవ్?" అన్నాడు భానుమూర్తి అయోమయంగా.

"అంత నమ్మలేక పోతే స్వయంగా వచ్చి చూడండి!" అనేసి అడ్రస్ చెప్పి ధనామని ఫోన్ పెట్టేసింది ఆవిడ.

బుర్ర గోక్కున్నాడు భానుమూర్తి కొంపదీసి ఏదైనా తేడా రాలేదు కదా! అలా జరిగితే ఉద్యోగం వూడడం ఖాయం వెంటనే బయలుదేరి ఆటో ఎక్కాడు భానుమూర్తి. ఆ ఇల్లు తనకు గుర్తే, మిలటరీ ఆఫీసరు గారిది. ఆటో ఆ ఏరియకి చేరింది. రైల్ గేట్ వేసి వుండడం వలన ఆటో ఆగింది రైలు వెళ్ళాక మళ్ళీ కదిలింది రైల్వేలైన్ దాటాక మెదటి ఇల్లే వాళ్ళది. ఇంటి ముందు దిగి లోపలికి వెళ్ళి కాలింగ్ బెల్ నొక్కాడు రెండునిముషాల అనంతరం తలుపు తెరుచుకుంది. వాకిలికి సరిపడా వున్న ఆ ఆకారానికి వినయంగా విష్ చేశాడు.

తల పంకించింది ఆవిడ. "లోపలికి రండి!" అంటూ లోపలికి దారితీసింది వెంట వెళ్ళాడు భానుమూర్తి. డ్రాయింగ్ రూమ్ దాటి డైనింగ్ రూమ్ దాటి బెడ్ రూమ్‌లోకి వెళ్ళింది ఆవిడ.

బెడ్‌రూమ్ గుమ్మందగ్గర మొహమాటంగా ఆగిపోయాడు అతను "కమిన్" అని కేకేసింది ఆవిడ. నెమ్మదిగా లోపలికి వెళ్ళాడు. చక్కగావుంది ఆ బెడ్‌రూమ్ గదిమధ్య పెద్ద మంచం. ఆ మంచంవైపు చూపించి 'అలా పడుకోండి!' అందావిడ అదిరిపడ్డాడు భానుమూర్తి.

ఇల్లు ఇలా చూడడానికి బాగానేవుంది ఇందాక నేను ఈమంచం మీద పడుకుని నవల చదువుకుంటూ వుండగా పక్క ట్రాక్ మీదనుంచి రైలువెళ్ళింది. ఆ అదురుకి భూకంపం వచ్చినట్లు ఊగిపోవడం మెదలు పెట్టింది. ఒక్కసారే గాభరా వేసింది నాకు. వెంటనే మీకు ఫోన్ చేశాను. నే చెప్తే నమ్మలేరుగా మీరు, స్వయంగా చూడండి" అంది ఆవిడ.

"అలాగా! నేనలా డైనింగ్‌రూమ్‌లో నిలబడతాను! రైలొస్తే చూస్తాను!" అన్నాడు కంగారుగా.

"అలా వీల్లేదు, ఇంకెక్కడ వున్నప్పుడు రైలొచ్చినా ఏమీ తేడా తెలీడం లేదు. ఇక్కడే వున్నప్పుడు మాత్రమే లోపం కనబడుతోంది. కాబట్టి మీరిక్కడే వెయిట్ చెయ్యండి. మరో పావుగంట తరవాత రైలొస్తుంది. నాపని మధ్యలో వదిలేసి వచ్చాను" అనేసి వెళ్ళిపోయింది ఆవిడ.

అయోమయంగా ఆవిడ వంక చూసి మొహమాటంగా వెళ్ళి మంచం మీద కూర్చున్నాడు భానుమూర్తి. పుట్టి బుద్ధి తెలిశాక ఇలాంటి పరిస్థితి ఎదురవలేదు అతనికి. త్వరగా రైలొచ్చేస్తే బాగుండు అనుకుంటూ వాచీ వంక చూస్తూ కూర్చున్నాడు సెకండ్ల ముల్లు తిరుగుతూ వుంది మరో అయిదు నిముషాలు ఆగితే రైలొచ్చేస్తుంది అనుకున్నాడు భానుమూర్తి.

అంతలో అడుగుల శబ్దం. తలెత్తి చూశాడు భానుమూర్తి. ఎదురుగా గుమ్మంలో ఆ ఇంటి యజమాని. కూనిరాగం తీస్తూ పడగ్గదిలోకి అడుగుపెట్టిన ఆయన ఎదురుగా మంచంమీద మనిషిని చూసి అదిరి పడ్డాడు.

అతని భృకుటి ముడి పడింది. కళ్ళు తీక్షణంగా మారి పోయాయి.

"యూ?" అన్నాడు తీవ్రంగా. వణికిపోతూ నిలబడి పోయాడు భానుమూర్తి.

"నువ్వు! నారూమ్‌లో ఈ సమయంలో ఏంచేస్తున్నావో ఏమిటిదంతా? ఎన్నాళ్ళనించీ సాగుతోంది ఈ నాటకం!" గద్దించాడు ఇంటాయన

భానుమూర్తి గుండె గొంతులోకి వచ్చేసింది! మలేరియా పేషెంట్‌లా వణికిపోతూ "నేనే పాపం ఎరగనుసార్! భగవంతుడి సాక్షిగా చెప్తున్నాను. ఐయామ్ వెయిటింగ్ ఫర్ ది ట్రైన్" అన్నాడు దీనంగా. ●

## పొత్తూరి విజయలక్ష్మి